ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



**( ఐభీమవరంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 12-12-97)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈ రోజు అరుణాచల దీపోత్సవం. ఈ రోజు అరుణగిరిపై జ్యోతిప్రజ్వలన చేస్తారు. జ్యోతి ప్రజ్వలన అంటే హృదయంలో జ్ఞానదీపం వెలిగించుకోమని సంకేతం. జ్ఞానదీపం వెలిగించుకొంటే అజ్ఞానం నశిస్తుంది. అజ్ఞానం ఎప్పుడైతే నశించిందో అజ్ఞానం కూడా ఉండే దుర్గుణాలు అన్నీ నశిస్తాయి. మన హృదయంలో జ్ఞానదీపం వెలిగించుకోవటానికి ఎవడైతే సహాయ సహకారములు అందిస్తున్నాడో వాడే గురువు. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసిన దేహభావన తగ్గించుకొంటూరావాలి, దైవభావన పెంచుకొంటూ రావాలి. అరుణాచలంలో విశేషం ఏమిటి అంటే అక్కడ ఉన్న దేవుని పేరు అరుణాచలం, కొండపేరు అరుణాచలం, ఆ ఊరిపేరు అరుణాచలం. తమిళంలో అన్నామలై అంటారు. అంటే అందని కొండ. దేనికి అందదు అంటే, మన మనస్సుకు, వాక్కుకు తత్వం అందదు మనకు పంచభూతములు ఉన్నాయి. పంచభూతములు లేకపోతే సృష్టిలేదు. ఇవి ఉన్నప్పుడు, ఇవి లేనప్పుడు కూడా ఒక శక్తి ఉంది. ఈ సృష్టి అంతకు ఆశక్తే ఆధారము. భారతదేశంలో పంచభూతములకు పంచలింగములు ఉన్నాయి. కంచిలో ఉన్నది పృధ్విలింగం, జంబుకేశ్వరంలో ఉన్నది జలలింగం, అరుణాచలం ఉన్నది అగ్నిలింగం, శ్రీకాళహస్తిలో ఉన్నది వాయులింగం, చిదంబరంలో ఉన్నది ఆకాశలింగం.

భగవంతుడికి రూపం, నామంలేదు. నామరూపములను మనమే కల్పించుకొన్నాము. నామరూపములకు ఆధారంగా ఉన్న తత్వాన్ని అర్ధంచేసుకోవటానికి భగవంతుని ఏదో రూపంలో ఆరాధిస్తూ ఉంటే మనకు నిజం తెలియకపోయినా ఆయనకు నిజం తెలుసుకాబట్టి నిజం దగ్గరకు మనం చేరేవరకు మనలను వెంటాడుతూ ఉంటాడు. శివుడిని లింగరూపంలో ఆరాధిస్తాము. శివలింగంరూపానికి, అరూపానికి మధ్యలో ఉంది. పూర్తిగా రూపంలేదు, అసలు రూపం లేకుండానూ లేదు. నామరూపముల నుండి నామం లేని, రూపం లేని స్థితికి తీసుకొని వెళ్ళటానికి లింగోధ్భవం జరిగింది. తొలిలింగం, ఆదిలింగం అరుణాచలం. బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు ప్రార్ధననుసరించి పరమేశ్వరుడు ఇక్కడ లింగరూపం ధరించాడు.

కొంతమంది ఒకే ఇంటిలో ఉంటారు. మానసికంగా దూరంగా ఉంటారు. దేహగతంగా దగ్గరగా ఉండి మానసికంగా దూరంగా ఉండటం కంటే దేహగతంగా దూరంగా ఉన్నా మానసికంగా దగ్గరగా ఉండటం మంచిది. మీ శరీరానికి సదుపాయములు తక్కువగా ఉన్నా మీ మనస్సు కంట్రోలులో ఉంటే మీకు ఎక్కువ ఆనందము, శాంతి కలుగుతుంది. తలంపుకు కూడా బలం ఉంది. మీరు

ఇంటి దగ్గర కూర్చొని ఎవరైనా బాగుపడాలని మీరు హృదయపూర్వకంగా అనుకొంటే ఆవైబ్రేషన్స్ వారి మీద పనిచేస్తాయి. వారు మంచివారు, వీరు చెడ్డవారు అని జడ్జిమెంట్ ఇవ్వకూడదు. వాడు చెడ్డవాడు అని చెప్పటం కంటే నీవు మంచివాడుగా ఉండు ఉంటే నిన్నుచూసి ఎదుటివాడు బాగుపడతాడు. చనిపోయే సమయం మనకు పరీక్ష వంటిది. మన హృదయంలో నుండి ఒక తలంపు తరువాత ఒక తలంపు మన బ్రెయిన్‌లోనికి వచ్చి మరలా హృదయంలోనికి వెలుతూ ఉంటాయి. అలా తిరిగేటప్పుడు ఏదైతే మనకు బాగా ఇష్టమో దానిని మనస్సు పట్టుకొంటుంది. దానిని బట్టి నీకు పునర్జన్మ వస్తుంది.

లోకంలో పని చేయవద్దు అని శాస్త్రంలో ఎక్కడా చెప్పలేదు. బేదదృష్టిని తగ్గించుకోమని చెప్పారు. మన మూలంలో మనం ఉండిపనిచేస్తూ ఉంటే పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా సమానంగానే ఉండగలము. మనం సముద్రంలాగ ఉండాలి. సముద్రంలో నీరు ఎండాకాలంలో ఆవిరి అవుతూ ఉంటుంది అయినా సముద్రం ఏమీ తగ్గదు. వర్షాకాలంలో నదులలో నీరు వెళ్ళి సముద్రంలో కలుస్తూ ఉంటుంది. అప్పడు ఏమి పొంగదు. సమానంగానే ఉంటుంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనం సమానంగా ఉండటానికి ప్రయత్నం చేయాలి. సముద్రం ఎంత లోతుగా ఉందో, ఆకాశం ఎంత విశాలంగా ఉందో మన జీవితం కూడా అలాగ ఉంటే ఇప్పడే ఇక్కడే మనకు మోక్షం కలుగుతుంది. దేహగతమైన నేనుకు వెళ్ళే **Food** ను ఆపుచేయండి. మనం చేయవలసింది అదే. అలాచేస్తే మరణం లేని వస్తువు మన చేతికి అందుతుంది. వ్యాపారం చేయటానికి కొంత డబ్బుకావాలి. జ్ఞాన సముపార్జనకు పెట్టుబడి అవసరం లేదు. తెలుసుకోవాలనే కాంక్ష ఉంటే సరిపోతుంది. నీకు శ్రద్ధలేకపోతే, కాంక్షలేకపోతే అనుమానాలు, సందేహాలు ఎక్కువ వస్తాయి. జ్ఞానాన్ని సంపాదించలేవు.

**(పాతాళ మెరకలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 28-11-97)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

తాను జీవిస్తూ ఇతరులు జీవించటానికి ఎవడైతే అవకాశం కల్పిస్తున్నాడో వాడు ధన్యుడు అని ఆచార్యులువారు చెప్పారు. మనం మంచి, చెడ్డ రెండూ తెలుసుకోవాలి. మంచి ఒక్కటీ తెలుసుకొని ఊరుకోవద్దు, చెడ్డకూడా తెలుసుకోవాలి. మంచి ఎందుకు తెలుసుకోవాలి అంటే దానిని మనం ఆచరింటానికి, చెడ్డ ఎందుకు తెలుసుకోవాలి అంటే మనం దానిని వదిలివేయటానికి తెలుసుకోవాలి. దానికి సూక్ష్మ బుద్ధి ఉండాలి. సూక్ష్మ బుద్ది గ్రహించే విషయాలు స్థూల బుద్ది గ్రహించలేదు. మనం బుద్దితో ఎన్ని విషయాలు గ్రహించగలమో అన్ని విషయాలు గ్రహించటం మంచిదే, కాని బుద్దికి ఆధారంగా ఉన్న వస్తువును నీ బుద్దితో గ్రహించలేవు, అలాగని నీ బుద్దితో గ్రహించిన విషయాలను వదిలివేయమని చెప్పటం లేదు. ఎక్కడయితే మనోవృత్తి అణిగిందో అక్కడ మనస్సుకు ఆధారంగా ఉన్న వస్తువు నీకు తానుగా వ్యక్తమవుతుంది దానినే మోక్షం అంటున్నారు. దానిని మనం పొందాలి. ఎన్ని యజ్ఞాలు చేసినా, పూజలు చేసిన, సమాజంకోసం ఏవైనా మంచి పనులు చేసినా ఇవి అన్నీ సాధనములు మాత్రమే, కాని మన జీవితలక్ష్యం మోక్షమే. కర్మఫలం శాశ్వతంగా ఉండదు. బాహ్యంగా

చేసేవి శాశ్వతంకాదు, కాల ప్రవాహములో అవి కొట్టుకొని పోతాయి. ఒక్క మోక్ష సుఖము మాత్రమే శాశ్వతంగా ఉంటుంది.

పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ చేస్తున్నాము కాని మనస్సు కుదురుగా ఉండటం లేదు అంటారు. ఎందుచేతనంటే ఇప్పడు నీకు మనస్సే నేనుగా వ్యక్తమవుతోంది. మనస్సుకు లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసన, హెచ్చు తగ్గులు అన్నీ ఉంటాయి. ఒక వాసన అటులాగుతుంది, ఒక వాసన ఇటు లాగుతుంది. దానిని స్థిరంగా ఉండనివ్వవు. గాలి వలన ఆకులు ఎలా కదులుతూ ఉంటాయో అలాగ నీలోపల ఉన్న వాసనలు నీమనస్సును చలించేటట్లు చేస్తాయి. వాసనలు పూర్తిగా క్షయించే వరకు దానిని ఎవరూ ఆపుచేయలేరు. జ్ఞానం రావటంచాలా కష్టం అని మీరు అనుకోవద్దు. ఎవరో చెప్పిన మాటలు భుజాన వేసుకొని తిరగవద్దు. మన హృదయంలో ఉన్నదే అది. మన లోపల జీవితం, బయట జీవితం ఐక్యమయిపోతే జ్ఞానం వచ్చేస్తుంది. మన ఆలోచనవేరు, మాట్లాడే మాట వేరు, చేసేపని వేరు ఇంక మనకు జ్ఞానం ఎలా కలుగుతుంది ? గాఢనిద్రలో మనకు స్వప్నం వస్తుంది. స్వప్నం జరిగినంత సేపు అది నిజం అని మనకు అనిపిస్తుంది. మెలుకువవచ్చాక అది అంతా అబద్ధం అని మనకు తెలుస్తుంది. అలాగే ఇప్పడు మనం అజ్ఞానం అనే మహానిద్రలో ఉన్నాము. ఈ అవస్థలు అన్నీకూడా అందులో జరిగిపోతున్నాయి. అజ్ఞానం అనే నిద్ర నుండి మేల్కొన్నప్పడు ఇవి అన్నీ కూడా అబద్ధం అని నీకు తెలుస్తుంది.

హృదయంలో ఒక నిజం ఉంది. దానిని నీ మనస్సుతో తెలుసుకోవటానికి నీ మనస్సుకు అది ఒక విషయంకాదు, మనస్సుతో గ్రహించే విద్యలు అన్నీ పొట్టకే పరిమితం. నీ మనస్సుకు ఆధారంగా ఉన్న వస్తువును తెలుసుకొంటే అది నిజమైన విద్య. గుణాలు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు అణిగిపోతే గుణాలు అన్నీ అణగిపోతాయి, కొంతమంది వంద సంవత్సరములు జీవించినా వారికి అంతర్‌దృష్టి కలుగదు. నీవు ఎప్పడైనా నిష్కామకర్మ చేసావా, నిన్ను నీవు మర్చిపోయి ఎవరినైనా ప్రేమించావా సత్పురుషులతో సహవాసం చేసావా, సద్గురువుకు సేవ చేసావా, ఈశ్వరుని యందు నీకు ప్రేమ, భక్తి ఉందా ? ఇవి అన్నీ లేనప్పడు మనస్సు ఎలా అణుగుతుంది. మనస్సు అణిగితే కదా దానికి అంతర్‌దృష్టి కలిగేది. దానికి అంతర్‌దృష్టి కలిగితే కదా అంతఃకరణంలో ఉన్న ఆత్మ నీకు వ్యక్త మవ్వటం. నీకు ధనం ఉన్నంతమాత్రం చేత, గౌరవం ఉన్నంతమాత్రం చేత, చదువు ఉన్నంత మాత్రంచేత జ్ఞానం కలుగదు. ఇవి అన్నీ బాహ్యవిషయాలు. బాహ్యంలోనికి వెళ్ళకండి మనస్సును బంగారం చేసుకొంటే జ్ఞానం వస్తుంది.

నా నోటిలో మట్టిని కొట్టి, నాబ్రతుకు హరించావు అరుణాచలా అన్నారు భగవాన్ మనకు దేహం వచ్చింది అంటే ఇంద్రియాలు ఉంటాయి. ఇంద్రియాలు లేకుండా దేహం రాదు. ఒకో ఇంద్రియానికి ఒకో సుఖం ఉంటుంది. ఆ సుఖం ఆ ఇంద్రియాన్ని ఆకర్షిస్తూ ఉంటుంది. నీవు నా నోటిలో మట్టిని కొట్టావు అంటే ఏ ఇంద్రియానికి ఏసుఖం ఉందో ఆసుఖం మీద ఆ ఇంద్రియానికి ఆకర్షణ లేకుండా

చేసావు. నీవు ఇలా చేస్తావు అని అనుకోలేదు. నీవు జ్ఞానగురువు అని లోకం అంతా చెప్పకొంటూ ఉంటే నీదగ్గరకు వచ్చాను. నీవు నా కొంపను ముంచేసావు అన్నారు భగవాన్. అంటే నాలోని దేహ భావనను తీసేసావు. దేహభావన ఎప్పుడైతే నశించిందో అప్పుడు జ్ఞానం కలుగుతుంది. దేహ భావన పోతే నీవు అనుకోకుండానే నీద్వారా అనేక మంచి పనులు, గొప్పపనులు జరుగుతాయి. దేహాభిమానంతో చేసిన పనులు నీకు సుఖాన్ని ఇవ్వవు, ఇతరులకు సుఖాన్ని కలిగించవు. నీవు రీజన్ విడిచి పెట్టకు. రీజన్‌కు విషయం అందనప్పడు గురువు చెప్పిన, శాస్త్రం చెప్పిన వాక్యాన్ని ప్రమాణంగా తీసుకో, నేను ఉన్నాను అని అనుకోవటంలో ప్రమాదం లేదు నేను అలా ఉన్నాను, నేను ఇలా ఉన్నాను, నేను ధనవంతుడిని, నేను పేదవాడిని నేను స్త్రీని, నేను పురుషుడను అని దేనితో ఒక దానితో తాదాప్యం చెందటం వలన దేహభావన పెరిగిపోతూ ఉంటుంది. నీవు ఏదిగా ఉన్నావో అలా ఉంటే నీకు మోక్షం కలుగుతుంది. నీవు దేనినైతే పొందాలి అనుకొంటున్నావో ఆవస్తువు మీద ప్రేమ లేకుండా, దానిని పొందాలి అనే తపన లేకుండా ఆవస్తువును పొందలేవు. నీమనస్సులో రజోగుణం పెంచుకొంటే మోహంలో పడతావు, బంధంలో పడతావు, అదే మనస్సులో సత్వగుణం పెంచుకొంటే వెలుగులోనికి వెళతావు. సత్వగుణం మోక్షం దగ్గరకు తీసుకొనివెళుతుంది.

మనకు మనస్సు, శరీరం రెండు తెలుస్తున్నాయి. మనస్సుకు వచ్చే రోగాలు వేరు, దేహానికి వచ్చే రోగాలు వేరు. ఈరోగం మనస్సుకు సంబంధించినది, ఈరోగం దేహానికి సంబందించినది అని వీడదీసుకోవటం మనకు తెలియటం లేదు. మనస్సుకు సంబంధించిన రోగాలను దేహానికి కలిపేసుకొంటున్నాము. ఈరోగం దేహానికి సంబంధించినది, ఈరోగం మనస్సుకు, సంబంధించినది అని ఈరెండింటికి తేడా ముందు నీకు తెలియాలి. లోచూపు వలన ఈతేడా నీకు తెలుస్తుంది. అంతర్‌దృష్టి కలగటం వలన లోపల ఉన్న వస్తువు నీకు తెలుస్తుంది. అది తెలిసాక నీకు తెలుస్తుంది, అదే నీవు అన్న సంగతి. ఈ జన్మలు అన్నీ స్వప్నంతో సమానము అని అప్పడు నీకు తెలుస్తుంది.

**శ్రీ నాన్నగారి ప్రవచనములు**

**ఫిబ్రవరి 14,15, తేదీలలో - సఖినేటిపల్లి**

**ఫిబ్రవరి 20,21,22, తేదీలలో - ఖండవల్లి**

**ఫిబ్రవరి 25,వ తేది - చించినాడ**

**మార్చి 16వ తేది - జిన్నూరు**